నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 19 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## అర్హులందరికీ రుణమాఫీ అందాలి

**కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 18 : అర్హులందరికీ రుణమాఫీ అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, జిల్లా వ్యవ సాయశాఖ అధికారి శ్రీనివాస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషితో కలిసి బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లక్షా 35 వేల మంది రైతులు రుణమాఫీ పొందేందుకు అర్హత కలిగి ఉన్నారని, మొదటి విడుతలో రూ. లక్ష లోపు రుణ మాఫీ పొందే రైతులు 22 వేల మంది ఉన్నారన్నారు. రైతు ఖాతాల్లో జమ అయిన మొత్తాన్ని ఎలాంటి షరతులు లేకుండా రైతులకు అందించాలని బ్యాంకు అధికారులకు సూచించారు.

## 200 బస్తాల యూరియా పట్టివేత

● నాలుగు వాహనాలను సీజ్ చేసిన సీఐ

ఎరువులను తరలిస్తున్న వాహనాలను పరిశీలిస్తున్న సీఐ

చెన్నూర్ రూరల్, జూలై 18 : చెన్నూర్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 200 బస్తాల యూరియాను సీఐ రవీందర్ పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు గురువారం పట్టణంలోని 63వ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా, సుమారు 200 బస్తాల యూరియా తరలిస్తున్న నాలుగు వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చెన్నూర్ పట్టణంలోని కామాక్షి ట్రేడర్స్, లక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్ నుంచి డీఏపీ, 20-20 యూరియా బస్తాలను కోటపల్లి మండలం అన్నారం, రొయ్యలపల్లి గ్రామాలకు చెందిన రైతుల పేర్ల మీద (బిల్లులు లేకుండా) కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు ఏవో శ్రీనివాస్ తెలిపారు. కాగా, కొన్నేళ్లుగా చెన్నూర్‌కు చెందిన డీలర్లు మహారాష్ట్రకు ఎరువులను అక్రమంగా తరలిస్తున్నారు. స్థానిక డీలర్లు వ్యవసాయ శాఖ అధికారులతో చేతులు కలిపి యథేచ్ఛగా దందా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

దండేపల్లి : సీఎం ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వింటున్న కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

## అట్టహాసంగా..

● వర్చువల్ విధానంలో ప్రారంభించిన సీఎం ● పాల్గొన్న కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 18(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి.. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ సురేందర్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వ్యవసాయ, ఆర్థిక శాఖల కార్యదర్శులతో కలిసి గురువారం వర్చువల్ విధానంలో రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతు వేదికలో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఖాదర్ హుస్సేన్, పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : సీఎం కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ప్రజాప్రతినిధులు

# 'రుణమాఫీ' గందరగోళం

### వచ్చిన వారికంటే రానివారే ఎక్కువ?

- ప్రామాణికం ఏమిటో తెలుపని సర్కారు
- రూ.లక్షలోపు కొందరికే వర్తింపు..
- ప్రభుత్వ కొర్రీలతో సామాన్య రైతుల వర్రీ
- అర్హుల జాబితాపై కొరవడిన స్పష్టత
- ఉమ్మడి జిల్లాలో 96,043 రైతు కుటుంబాలకు రూ.572.15 కోట్లు రుణమాఫీ

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తొలి విడుతలో రైతు రుణమాఫీ వివరాలు..**

| జిల్లా | రైతు కుటుంబాల సంఖ్య | రుణమాఫీ అకౌంట్లు | డబ్బులు |
|---|---|---|---|
| మంచిర్యాల | 27,827 | 29,421 | రూ.154.39 కోట్లు |
| నిర్మల్ | 28,825 | 30,106 | రూ.171.77 కోట్లు |
| ఆసిఫాబాద్ | 21,038 | 22,000 | రూ.125.20 కోట్లు |
| ఆదిలాబాద్ | 18,353 | 18,821 | రూ.120.79 కోట్లు |
| మొత్తం | 96,043 | 1,00,348 | రూ.572.15 కోట్లు |

మంచిర్యాల, జూలై 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు, ఇప్పుడు చేస్తున్న దానికి పొంతన లేకుండా పోయింది. పూటకో మాట మారుస్తూ జనాలను గందరగోళంలో పడేస్తున్నది. రుణమాఫీ చేసి రైతులకు ఊరట కలిగిస్తుందనుకుంటే కొద్ది మందికే మాఫీ చేసి చేతులు దులుపుకున్నది. లక్ష రూపాయల లోపు రుణాలు మాఫీ చేసి, ఆ తరువాత మాఫీ చేయకుంటే మా పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు మాట మార్చినట్లే అప్పుడూ ఏదో కారణం చెప్తే ఏం చేసేదని ఆందోళన చెందుతున్నారు. కుటుంబమే యూనిట్‌గా తీసుకుని రుణాలను రద్దు చేయడం ద్వారా చాలా మందికి నష్టం వాటిల్లుతున్నది. కుటుంబంలో ఒకరికి మాత్రమే రుణమాఫీ అమలు కాగా.. మార్గదర్శకాల పేరిట, సాంకేతిక కారణాలతో చాలా మందికి నష్టం వాటిల్లనున్నది. సాగు కోసం తీసుకున్న అప్పులు కాంగ్రెస్ సర్కారు రద్దు చేస్తున్నదని అన్నదాతలు పెట్టుకున్న ఆశలు గల్లంతవుతున్నాయి. తొలి విడుతలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలో 96,043 రైతు కుటుంబాలకు రుణమాఫీని వర్తింపజేశారు. కానీ.. రుణాలు తీసుకున్న వారి సంఖ్య ఇప్పుడు చేసిన మాఫీ కంటే మూడు, నాలుగింతలు ఎక్కువగా ఉంది. ఇందులో చిన్న, సన్నకారు రైతులు చాలా మంది రుణమాఫీ రాదని తెలిసి తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. రైతులకు రుణభారాన్ని తగ్గించడాన్ని బాధ్యతగా తీసుకోవాల్సిన సర్కారు చేతులు దులుపుకుంటుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నిబంధనల పేరిట కోత

రైతు ప్రయోజనాలను విస్మరించి ఇచ్చిన హామీని అమలు చేశామని చెప్పుకునేందుకే కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ చేసినట్లు ఉంది. మార్గదర్శకాల పేరిట చాలా మంది రైతులకు రుణమాఫీ ఫలాలు అందకుండా చేసింది. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన అర్హతలు, రేషన్ కార్డును ప్రామాణికమని చెప్పి ప్రతి గ్రామంలో 25 శాతం నుంచి 30 శాతం మందికే తొలి విడుతలో రుణమాఫీ చేసింది. ఒక కుటుంబంలో ఒకరికే రుణమాఫీ నిబంధనతో చాలా మంది నష్టపోయారు. కుటుంబంలో ముగ్గురు తీసుకుందామనుకుందాం.. ఈ ముగ్గురిలో ఒకరు రూ.50 వేలు, మరొకరు రూ.30 వేలు, ఇంకొకరు రూ.30 వేలు పంట రుణం తీసుకుంటే ముగ్గురి రుణం కలిపి రూ.1.10 లక్షలు అవుతున్నది. లక్ష లోపు రుణమాఫీతో ముగ్గురిలో ఏ ఒక్కరికీ రుణమాఫీ వర్తించడం లేదు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో కార్డులు తీసుకోకుండా జాయింట్ ఫ్యామిలీలో ఉన్న వారు కూడా నష్టపోయారు. కిసాన్ సమ్మాన్ యోజన నిబంధనలు వర్తింపచేయడంతో ఐటీ చెల్లింపుదారులకు షాక్ తగిలింది.

### రైతు రుణమాఫీ కాదు.. కుటుంబ రుణమాఫీ..

రైతులకు రూ.2 లక్షల రూపాయల స్వల్పకాలిక రుణమాఫీ హామీ అటకెక్కింది. బ్యాంక్ రుణాలు, రేషన్‌కార్డులను లింక్ చేసి రైతు రుణమా రైతుల రుణమాఫీని కుటుంబ రుణమాఫీగా మార్చేశారు. ఇంతవరకు ఏ రుణమాఫీలో పెట్టని నిబంధనలకు తెరలేపిన అప్రదిష్టను కాంగ్రెస్ సర్కారు మూటగట్టుకుంది. కుటుంబం అనే నిబంధనతో చాలా మందిని నష్టం వాటిల్లింది. కొత్త రేషన్‌కార్డులు రాక, పాత వాటిలో మార్పులు-చేర్పులకు అవకాశం లేక విడిపోయిన రైతు కుటుంబాల పేర్లు ఒకే కార్డులో ఉన్నాయి. దీంతో ఉమ్మడి కుటుంబంలో విడివిడిగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి తీవ్ర నష్టం జరిగింది. రీ-షెడ్యూల్ చేసిన పంట అప్పులకు, లోన్ ఎలిజిబిలిటీ కార్డు కింద రుణమాఫీ వర్తించదని చెప్పడంతో మరికొంత మందికి రుణమాఫీ కోతలు తప్పడం లేదు. జిల్లాలవారీగా తొలి విడుత రూ.లక్ష లోపు రుణమాఫీ రైతుల జాబితాను విడుదల చేసిన అధికారులు, అసలు లక్షలోపు రుణం తీసుకున్నవారు ఎంతమంది ఉన్నారంటే మాత్రం చెప్పడం లేదు. అలాంటి జాబితానే లేదని చెప్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులను అడిగితే లీడ్ బ్యాంక్ వారిని లేదా బ్యాంకర్లను అడగమని చెప్తున్నారు. బ్యాంకర్లను అడిగితే వ్యవసాయ శాఖ నుంచి వచ్చిన జాబితా మేరకు రుణమాఫీ చేస్తున్నామని, ఇందులో తమరోల్ నామమాత్రమని చెప్తున్నారు. ఎవరికి వారు తప్పించుకునే సమాధానాలు తప్పితే ఎవ్వరూ స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో గందరగోళం నెలకున్నది. మరి ఇప్పటికైనా ప్రభు త్వం రుణ మాఫీ కాని రైతులకు ఎందుకు మాఫీ చేయలేదనే వివరణ ఇస్తుందా? లేకపోతే మలి విడుతలో అవకాశం కల్పిస్తుందా? అనే విషయంపై స్పష్టత కరువైంది.

### 'చేతు'లు దులుపు కున్నారు!

> కేసీఆర్ హయాంలో షరతుల్లేకుండా వర్తింపు

కేసీఆర్ సర్కారు హయాంలో షరతు ల్లేకుండా రుణమాఫీ చేశారు. గుంట భూమి ఉండి రు ణం తీసుకున్న వారిని రైతులుగా పరిగణించి రుణ మాఫీ చేశారు. రైతుబంధుతో పంటకు పెట్టుబడి సాయం అందించి పెద్ద మనసును చాటుకున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మా ఫీ చేశారు. కానీ.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కారు రైతులను దగాకు గురి చేసింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో ఇలాంటి షరతుల గురించి చెప్పకుండా ఇప్పుడు నిబంధనల పేరిట ప్లేట్ ఫిరాయించింది. పీసీసీ హోదాలో రేవంత్ రెడ్డి రూ.2 లక్షలోపు రుణాలు తెచ్చుకుంటే అధికారంలోకి వచ్చిన వెంటనే మాఫీ చేస్తామని ప్రకటించారు. డిసెంబర్‌లో ప్రమాణ స్వీకారం కాగానే రుణ బాధలు తొలిగిస్తామని చెప్పారు. అనేక వాయిదాలు వేసుకుంటూ వచ్చి ఇప్పుడు నిబంధనల పేరిట రైతులకు న్యాయంగా దక్కాల్సిన రుణమాఫీకి అనేక కోతలు పెడుతున్నారు.

### రుణమాఫీ సంబురాల్లో వర్గపోరు

- సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తుండగా అడ్డుకున్న కాంగ్రెస్ నాయకుడు

చెన్నూర్ రూరల్, జూలై 18 : మంచిర్యాల జిల్లా చెన్నూర్ కాంగ్రెస్‌లో మరోసారి వర్గపోరు బహిర్గతమైంది. గురువారం స్థానిక రైతు వేదికలో రుణమాఫీపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఏవో శ్రీనివాస్, మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు మూల రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మణ్ చల్ల రాంరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం రుణమాఫీ సంబురాల్లో భాగంగా కొందరు కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం చేసేందుకు సిద్ధమవుతుండగా, మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు మూల రాజిరెడ్డి అక్కడికి చేరుకొని అడ్డుకున్నాడు. తనకు చెప్పకుండా.. సంబురాలు ఎవరు చేయమన్నారంటూ అదే పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు అయిత హిమవంత రెడ్డిపై మండిపడ్డాడు. పాలాభిషేకం కార్యక్రమాన్ని నిలిపివేయాలంటూ గొడవకు దిగాడు. నాయకులను ఇష్టం వచ్చినట్లు తిట్టినట్లు సమాచారం. ఎన్నికలప్పటి నుంచి ఈ నాయకుడి ఆగడాలు మితిమీరి పోతున్నాయని, ఎన్నిసార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్రికల్లో కూడా ఈ నాయకుడి ఆగడాలపై కథనాలు వచ్చాయని వారు పేర్కొన్నారు. ఈ నాయకుడి వల్ల చెన్నూర్ పట్టణానికి చెందిన పులువురు ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు ఇటీవల బీజేపీలో చేరారని తెలిపారు. డబ్బులు వసూళ్లు చేయడం, బియ్యం, ఇసుక దందా చేయడంవంటివి చేస్తున్నా.. ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంపై కాంగ్రెస్ నాయకుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. సదరు నాయకుడి ఆగడాలు ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవ్వడం ఖాయమని నాయకులు మాట్లాడుకోవడం గమనార్హం.

### దండేపల్లిలో..

దండేపల్లి, జూలై 18 : మండల కేంద్రంలోని ద్వారక రైతువేదికలో రుణమాఫీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పర్చువల్ విధానం ద్వారా ప్రారంభించిన నేపథ్యంలో మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు వీసీ ద్వారా తిలకించారు. అంతకుముందు ఎడ్ల బండ్లతో ర్యాలీ తీశారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. గిరిజన కో ఆపరేటీవ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ డీఏవో సురేఖ, మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ గడ్డం నాగారాని-త్రిమూర్తి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అక్కల వెంకటేశ్వర్లు, కంది సతీష్‌కుమార్, ఏవో అంజిత్‌కుమార్, ఏపీవో దుర్గాదాస్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

### నేను తీసుకున్న రూ.25 వేలు మాఫీ కాలేదు..

ఉట్నూర్ రూరల్ : నేను 30 ఏండ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నా. నాపేరు మీద ఎకరం 10 గుంటల భూమి ఉంది. నేను గ్రామీణ బ్యాంకులో రూ.25 వేల వ్యవసాయ రుణం తీసుకున్నా. ప్రభుత్వం చేసిన లక్ష రుణమాఫీలో నాపేరు లేదు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మాత్రం మాఫీ చేసింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణాలు మాఫీ చేస్తామని, ఇప్పుడు మాలాంటి పేద రైతులకు రుణమాఫీ చేయలేదు. మేము యేటా బ్యాంకులో రుణం తీసుకుంటూ కడుతున్నాం. మేము ఉద్యోగాలు చేయడం లేదు. ఐటీలు కట్టడంలేదు. మాలాంటి రైతులకు కాకుంటే ఎవరికీ రుణమాఫీ చేస్తారో అర్థం కావడం లేదు. ప్రభుత్వం సర్వే నిర్వహించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

**- చందనగిరి రాజేశ్వర్, రైతు, కొత్తగూడ గ్రామం.**

### నేను అర్హుడిని.. జాబితాలో నా పేరు లేదు..

ఖానాపూర్, జూలై 18 : రేషన్‌కార్డు కచ్చితంగా అని చెప్పి రుణ మాఫీ చేయకపోవడం సరైన నిర్ణయం కాదు. నేను ఐదేండ్ల నాకున్న మూడెకరాల భూమిలో ఎవుసం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. మూడేండ్ల క్రితం ఖానాపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.90 వేల పంట రుణం తీసుకున్నా. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం లక్షలోపు పంట రుణం మాఫీ చేసిన లిస్టులో నా పేరు లేదు. ఈ ప్రభుత్వం నాలాంటి రైతులకు రుణమాఫీ చేయకుండా తీవ్ర అన్యాయం చేసింది. సర్కారు మాలాంటి రైతులపై దృష్టి సారించి రుణమాఫీ చేయాలని కోరుతున్నా.

**బావు రవి, రైతు, తర్లపాడు, ఖానాపూర్ మండలం**

# లాఠీచార్జి

- రాజ్‌భవన్ ముట్టడికెళ్లిన కార్మికులు, నాయకులపై పోలీసుల కర్కశం
- అరెస్టు.. పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- బొగ్గు బ్లాకులను సింగరేణికి ఇచ్చే వరకూ పోరాటం ఆగదన్న నేతలు

హైదరాబాద్ రాజ్‌భవన్ ముట్టడిస్తున్న టీబీజీకేఎస్ నాయకులపై లాఠీచార్జి చేస్తూ అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

శ్రీరాంపూర్, జూలై 18 : సింగరేణి గనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని చూస్తున్న కేంద్ర బీజేపీ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌ను ముట్టడించారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య, రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు టీఆర్ఎస్‌కేవీ రాంబాబు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావులు, కార్మికులతో కలిసి రాజ్‌భవన్ వద్ద ధర్నా చేస్తుండగా పోలీసులు కర్కశంగా వ్యవహరించారు. వారిపై లాఠీచార్జి చేశారు. బలవంతంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్మికులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బొగ్గు బ్లాకుల

విలేకర్లతో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

ను సింగరేణికి కేటాయించాలని, అప్పటి వరకూ పోరాటం ఆగదన్నారు. నామినేషన్ పద్ధతిలో సింగరేణికే గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ఉద్యోగ భద్రత ఉండదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం మోపే ప్రమాదముందని ఆరోపించారు. ప్రభుత్వరంగ పరిశ్రమ సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కుట్రను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గడప రాజయ్య, శ్రీనివాస్, కరిణ్, నాగెల్లి, పవణ్, అవినాశ్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, కొమరయ్య ఉన్నారు.

**అరెస్టులను ఖండిస్తున్నాం : ఏఐటీయూసీ**

కాసిపేట, జూలై 18 : ఏఐటీయూసీ నాయకుల అరెస్ట్‌లను తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. రాజ్‌భవన్ ముట్టడికి వెళ్లిన ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్, ఎస్‌సీడబ్ల్యూయూ అధ్యక్షుడు సీతారామయ్యతో పాటు సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేశ్, వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి, బ్రాంచ్ సహాయ సెక్రటరీ తిరుపతి గౌడ్, సూరంపూడి నాగేశ్వరావు, కాసిపేట్ మైన్ పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ, ఆఫీస్ బేరర్ మంతెన రమేశ్, బెల్లంపల్లి ఏరియా హాస్పిటల్ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ పుట్ట శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. గనులు ప్రైవేటీకరణపై నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపినా, జీఎం ఆఫీస్‌లు ముట్టడించినా, కలెక్టర్లకు వినతిపత్రాలు అందించినా ఎలాంటి స్పందన రాలేదని, అందుకే రాజ్‌భవన్ ముట్టడికి పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు.

# ఆశ కార్యకర్తల ఆగ్రహం

- హామీలు అమలు చేయాలంటూ ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ధర్నా
- పరీక్ష రద్దు చేసి.. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

మంచిర్యాల అర్బన్ : ఎమ్మెల్యే వివేక్ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

మంచిర్యాల అర్బన్ : ఎమ్మెల్యే పీఎస్సార్ పీఏకు వినతిపత్రం అందిస్తున్న ఆశ కార్యకర్తలు

మంచిర్యాల అర్బన్, జూలై 18 : కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైందంటూ ఆశ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనబాట పట్టారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాల, చెన్నూరు ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ఆశ కార్యకర్తలు ధర్నా చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ శోభ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు 19 ఏళ్లుగా కనీస వేతనానికి నోచుకోకుండా అనేక పని భారంతో వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చలేదన్నారు. జిల్లా నాయకులు పద్మ, విజయలక్ష్మి, సరోజ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, వేతనం రూ.18 వేలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ రూ. 50 లక్షలు,పెన్షన్ రూ. 10 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం రూ. 5 లక్షలు కల్పించాలని, లెప్రసీ, పోలియో టీకా, ఎలక్షన్ డ్యూటీల బిల్లులు మంజూరు చేయాలని కోరా రు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభు త్వం విఫలమైందని, వారికి నష్టం కలిగించే పరీక్షను రద్దు చేయాలని, లేదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు రాణి, హైమావతి మమతా, గురులక్ష్మి, కవిత,భారతి, ఉదయ, గీత, పద్మ, శారదా, లలిత, సుజాత పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679